# అసంపూర్ణ

ఆ రోజు ఉదయాన్నే జెన్నీ నుంచి ఫోన్.

ఎప్పుడూ లేనంత ఆనందం, ఉత్సాహంతో తడబడుతూందామె గొంతు.

ఎన్నాళ్ళకు తీరింది జెన్నీ కోరిక—ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తున్న ఒక చిన్ని పాప కావాలనే ఆమె కోరిక.... ఎంత తపన పడింది! ఎంతమంది డాక్టర్స్‌కి చూపించుకుంది!! చివరికి మనోవేదనతో మంచం పట్టిన ఆమెకు డాక్టర్ ఇచ్చిన సలహా ఎవరినైనా పెంచుకోమని.

భర్త అభ్యర్థన కాదనలేక అనాసక్తిగానే ఒప్పుకుంది. దాదాపు నెలరోజులు అన్నిచోట్లా తిరిగారు తమకు నచ్చేపిల్లవాడు దొరికేవరకూ. చివరికి తల్లిదండ్రీ కార్ యాక్సిడెంట్‌లో చనిపోయి మేనమామ దగ్గర అద రాభిమానాలకు నోచుకోకుండా పెరుగుతున్న ఓ చిన్నారి ఆరేళ్ళ బాబును చూసిన జెన్నీ కళ్ళలో ఆనందం తళుక్కున మెరిసింది. వెంటనే వాడిని పెంపకానికి తీసుకోవడానికి నిర్ణయించుకుంది.

అన్ని ఫార్మాలిటీస్ తీరి బాబు ఇంటికి వచ్చేసరికి దాదాపు నాలుగు నెలలు పట్టింది. ఆ నాలుగు నెలలు మనసులోనే బాబు కోసం ఆరాటపడుతూ, కలలు కంటూ గడిపింది జెన్నీ క్షణమొక యుగంలా.

ఆ బాబుని, జెన్నీ కలలపంట రాబిన్‌ను చూడ డానికి రమ్మనే ఇందాకటి ఫోన్‌కాల్.

పనంతా త్వరగా ముగించుకుని బాబుకు దారిలోనే ఓ చిన్న ప్రెజెంట్ కొని బయల్దేరాను.

రెండు బస్సులు మారి వరిలో వెళ్ళాల్సి వచ్చినా చాలా రోజుల తర్వాత జెన్నీని (ముఖ్యంగా ఆమె ఆనందంగా వుండడం) చూడబోతున్నాననే సంతోషం, ఆమె పెంచుకుంటున్న బాబును చూడాలనే కుతూ హలం ఎక్కువ కష్టం అన్పించనివ్వలేదు.

దూరం నుంచే క్రొత్తగా పెయింట్ చేసిన గేట్, క్రొత్తగా నాటిన గార్డెన్‌లోని పూల మొక్కలు ఆకర్షిం చాయి నన్ను. దాదాపు సంవత్సర కాలం నుంచీ ఇంతెత్తున గడ్డి పెరిగి ఆమె మనసులోని కల్లోలంలాగే చిందరవందరగా వుండే ఫ్రంట్ గార్డెన్ ఒకేసారి నీట్‌గా కార్పెట్ లాంటి లాన్‌తో, క్రొత్తగా పెట్టిన పూల మొక్కల సొగసుతో అందంగా వుండడంతో అదంతా బాబు రాకలోని జెన్నీ ఆనందం అని చెప్పకనే తెల్సి పోతుంది.

కాలింగ్ బెల్ నొక్కబోతూ ప్రక్కనే బ్రాస్ ప్లేట్‌పై చెక్కబడిన అందమైన ఇంగ్లీష్ అక్షరాలు ఆకర్షించి ఆగిపోయాను.

"డియర్ ఫ్రెండ్స్ అండ్ రెలెటివ్స్, వెల్ కమ్ టు అవర్ లిటిల్ స్వీట్ హోమ్.

మాతోబాటుగా మా చిన్నారి బాబు కూడా మిమ్మల్ని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాడు. వాడు మీరూహించుకున్నట్లుగా అందంగా లేకపోవచ్చు. అందరి పిల్లల్లాగా మిమ్మల్ని ఆనందపర్చలేక పోవచ్చు, కానీ దయచేసి వాడిని వేరే ప్లానెట్ నుంచి వచ్చిన వింత జంతువులాగా చూడకుండా వాళ్ళూ మామూలు మనిషేననీ, మనందరిలాగా వాడికీ సున్నితమైన మన సుందని, మీ పిల్లల్లాగే వాడూ మరో చిన్న పిల్లవాడని మీకు తెల్పినా అన్యథా భావించరని ఆశ. మీ చల్లని చిరునవ్వు, పలకరింపు బీటలువారిన ఈ పసివాడి మనసులో అమృతపుజల్లు కురిపిస్తుందని మరిచి పోనందుకు చాలా కృతజ్ఞతలు".

అంతా చదివి ఒక్క క్షణం అయోమయంగా నిలబడిపోయిన నన్ను జెన్నీ తలుపు తీసి చిరునవ్వుతో లోనికాహ్వానించింది. ఆమె కళ్ళల్లో నేనిదివరకెప్పుడూ చూడని ఆనందం తళుకులీనుతూంది.

లోనికెళ్తూ బ్రాస్ ప్లేట్ వేపు మరోసారి చూస్తున్న నా సందేహం కనిపెట్టి కాబోలు సిటింగ్ రూమ్‌లో నన్ను కూర్చోబెట్టి బాబుని తీసుకొస్తానంటూ నాకు ఆలోచించడానికి కాస్త టైమిస్తూ లోనికెళ్ళిపోయింది.

ఆమె బాబుని తీసుకొచ్చే ఆ కొన్ని క్షణాల్లో బాబు ఎలా వున్నా ఆశ్చర్యపడినట్లు కన్పించగూడదని, ఎత్తు కుని పలకరించాలనీ నిర్ణయించుకున్నాను.

"సే హలో టు ఆంటీ" అంటూ వీల్‌చేర్ నెట్టు కుంటూ వచ్చింది జెన్నీ.

బాబుని చూడగానే అప్రయత్నంగా లేచి నిలబడ్డాను నాలోని ఉలికిపాటును, ఆశ్చర్యాన్ని ఆపుకునే ప్రయ త్నంలో.

బంగారు రంగు ఉంగరాల జుట్టు, జాలిగొలిపే పెద్ద పెద్ద నీలికళ్ళు, తెల్లగా, ముద్దుగా వున్నాడు అనుకో బోయేంతలో వంకర తిరిగిన వాడి నోరు అందమైన ముఖాన్ని అసహ్యకరంగా మార్చేసింది. సరైన పోషణ లేకేమో సన్నగా, బలహీనంగా వున్నాడు.

"ఆంటీ కేమ్‌టు సీ యు రాబిన్" అంటూ నడవలేని బాబుని వీల్‌చేర్‌లోంచి తీసి ఎత్తుకుంటూ కూర్చుంది నా ప్రక్కనే.

"హలో! రాబిన్! హౌ ఆర్ యూ? నైస్ టు సీ యు" అంటూ నా చేతిలోని గిఫ్ట్ ప్యాకెట్‌ను ఇవ్వబోతే తీసుకోకుండా నా వేపూ ఆ ప్యాకెట్ వైపూ మార్చి మార్చి చూస్తున్న వాడి కళ్ళలో ఎందుకో భయం. చివరికి జెన్నీ చెబితే తీసుకున్నాడు.

"సే థ్యాంక్స్ టు ఆంటీ" రాపర్ విప్పుతూ సాగింది జెన్నీ తనూ నాకు థ్యాంక్స్ చెప్తూ. చిన్నగా, మెల్లిగా నా వైపు చూడకుండా "థ్యాంక్స్" అని అస్పష్టంగా అంటూ జెన్నీ గుండెల్లో తలదాచుకున్నాడు.

"క్రొత్తకదూ సిగ్గెక్కువ" అంటూ బాబుని హృద యానికి హత్తుకుంది వాడి తలపై ముద్దుపెట్టుకుంటూ.

ఆ ఒక్క చర్యతో నాకర్థమైపోయింది ఆ వారం రోజుల్లోనే వాళ్ళిద్దరి మధ్యా ఎంత మమతానుబంధం పెనవేసుకుందో.

కాసేపు బాబు గురించి మాట్లాడింతర్వాత వాడికి లంచ్ టైమయిందంటూ నేనిచ్చిన రైలు బొమ్మతో ఆడిస్తూ, బుజ్జగిస్తూ బ్రెడ్ తినిపించి సూప్ త్రాగించి కథలు చెబుతూ నిద్రబుచ్చింది. సన్నగా వంకరలుగా తిరిగి పెనవేసుకుపోయిన వాడి రెండు కాళ్లనూ ఆప్యా యంగా స్పృశించి దుప్పటి కప్పుతూ "అందరిలా ఆనం దంగా జీవించలేని దురదృష్టవంతుడు. ఒక చిన్న కరుణా వీక్షణం కోసం, ఒక చిన్న ప్రేమ వాక్కు కోసం అలమటించిపోయిన అభాగ్యుడు. చూడు నీ విచ్చిన రైలు బొమ్మ, ఆ కాస్త ఆప్యాయంగానైనా నీ పలుకరింపుతో వాడి కళ్ళలో ఎంత మెరుపో" దీర్ఘంగా నిట్టూరుస్తూ అంది కాఫీ కప్పు నా చేతికిస్తూ.

ఆ తర్వాత చాలా రోజులవరకూ మనసు నిండా జెన్నీ, రాబిన్‌ల గురించిన ఆలోచనలే నిండిపోయాయి.

జెన్నీ గుండెల్లో ఒదిగిపోయిన బాబు, అసహ్యకరంగా వున్న వాడి కాళ్ళను ఆప్యాయంగా నిమురుతున్న ఆమె అందమైన చేతులు, ఆ దృశ్యాలన్నీ పదే పదే కళ్ళల్లో మెదలసాగాయి. ఎన్నో ఏళ్ళుగా పిల్లల కోసం తపించి పోతున్న జెన్నీ పెంచుకునే బాబు ఎంతో అందంగా,

ఆరోగ్యంగా వుంటాడనుకున్నాను. కానీ రాబిన్‌ను ఎలా తెచ్చుకోగల్గిందీ చాలాసేపటి వరకూ అర్థం కాలేదు. జెన్నీ చాలాసార్లు వికలాంగుల కోసం, చిల్డ్రన్స్ హోమ్స్ కోసం, ఓల్డ్ పీపుల్స్ హోమ్స్ కోసం ఫ్యాన్సీ వేషాలు వేసి, విరాళాలు సేకరించి ఎంతో చేసేది. ఆమెలోని కరుణార్ద్ర హృదయమే అందుకు కారణమని తెల్సుగాని, రాబిన్‌ను పెంచుకోగల్గేంత ఉన్నత హృదయమని గ్రహించలేకపోయానివ్వాళ్టా. .

హఠాత్తుగా చాలా రోజులుగా దాదాపు అయిదేళ్ళుగా కలలో కూడా గుర్తుకురాని సుచిత్రవాళ్ళ పాప గీతిక గుర్తొచ్చి మనసంతా ఆవేదనతో నిండిపోయింది.

గీతిక సుచిత్ర వాళ్ళ పెద్ద పాప. అప్పటికి బహుశః పదేళ్ళుంటాయేమో. చిన్నప్పుడే పోలియో వచ్చి రెండు కాళ్ళూ పడిపోయాయి ఆ అమ్మాయికి. మొదట్లో సుచిత్ర, రమేష్ చాలా బాధపడ్డారు. ఎంతమంది డాక్టర్లకి చూపించినా లాభం లేకపోయింది. తర్వాత రెండేళ్ళకే రెండో పాప దీపిక పుట్టడంతో గీతిక గురించిన విచారం కాస్త మరిచారు వాళ్ళు. కానీ పెరిగేకొలది తెల్లగా, పెద్ద పెద్ద కళ్ళతో ముద్దుగా బొమ్మలా వుండే దీపికను చూసేకొలదీ గీతిక స్థితికి జాలి కలగకపోగా ఇద్దరినీ పోల్చి చూస్తూ గీతికపైని ప్రేమ, సానుభూతి క్రమంగా మాసిపోయి, దీపికపై అభిమానాన్ని, ప్రేమను రెట్టింపు చేయసాగింది. దానికి తోడు ఎప్పుడూ దీపిక అక్కను వెక్కిరిస్తూ, లేనిపోని చాడీలు చెబుతూ అల్లరిచేస్తూ గీతికకు కోపం తెప్పిస్తుండేది. ఫలితం గీతికకే దెబ్బలు, తిట్లు తల్లిదండ్రుల చేతుల్లో. మొదట్లో తన దుస్థితికి, అమ్మానాన్నల ప్రవర్తనకు బాధపడినా క్రమక్రమంగా మౌనంగానే అన్నీ భరించడం అలవాటైపోయి స్తబ్దంగా మారిపోయిందా పసి మనసు. రానురాను గీతికతో ఎవరూ మాట్లాడడమే మానేశారు. ఆ అమ్మాయీ ఒక మనసున్న మనిషేనని మర్చేపోయారందరూ. క్రొత్తగా వచ్చే అతిథులకు జూలో జంతువుగా, ఉబుసుపోని అమ్మలక్కల కబుర్లకు



# శిల్పాలు

— మాచర్ల హేమ



కేంద్రంగా, ఎదుటివారి నుంచి సుచిత్రకు సానుభూతి సంపాదించగల యంత్రంలా మారిపోయింది చివరికి.

## దివ్వె తలమీద దినకరుడు

కారెనుబోతు మీద
స్వారీచేస్తున్న
దిగంబర బాలుడిలా
దివ్వె తలమీద
దిన మొలతో
దినకరుడు;

అంధకార సింహాసనంమీద
ఆసీనమై
మీసాలు మెలిపెడుతున్న
అహంకార ప్రతిరూపం
ఆశ్వయుజ అమావాస్య;



యవ్వన ప్రాంగణంలో
అడుగు పెడుతున్న కన్య
పరికిణీ అంటుకుంటుందనే
భయం లేకుండా
విచ్చుకత్తుల్లాంటి
వక్షోజాలు వంచి
చిచ్చుబుడ్లు అంటిస్తున్నది;
అరోరా బొరియాలిస్.

ఆవహించిన
ఉత్తర ధ్రువంలా
వుంది ఈ రాత్రి —
దిగివచ్చిన నక్షత్ర మండలం
దీపావళి ధాత్రి.

—డాక్టర్ దాశరథి

ఆ రోజు నాకింకా జ్ఞాపకం. బహుశః దీపిక బర్త్‌డే అనుకుంటా. పెద్ద పార్టీ అరేంజ్ చేసి అందరిని పిలిచారు. మేము వెళ్ళేసరికి హడావుడిగా వుంది ఇల్లంతా. గులాబీరంగు ఫ్రాక్‌లో ముద్దుగా వుంది దీపిక. అందరూ ప్రెజెంట్స్ ఇస్తూ పాపను ముద్దుచేస్తూ పొగుడుతున్నారు. నేనూ "ఎంత అందంగా వుందో మీ పాప" అనకుండా వుండలేకపోయాను సుచిత్రతో. పాప గురించిన గర్వం దాచుకోలేని ఆమె కళ్ళు మిలమిలా మెరిశాయి.

అంతమందిలోనూ ఓ మూలగా వీల్‌చేర్‌లో మౌనంగా కూర్చుని దీనంగా చూస్తున్న గీతికను గమనించకపోలేదు నా కళ్ళు. కానీ మనసు అంతగా పట్టించుకోలేదు.

పార్టీ మధ్యలో ఎవరో అడిగారు సుచిత్రను గీతిక డిజేబుల్డ్ హోమ్‌లోకి వెళ్ళడం ఎప్పుడంటూ. "వచ్చే నెల్లోనే. అబ్బ ఇన్నాళ్ళు ట్రైచేస్తే ఇప్పటికి దొరికింది అందులో ప్లేస్! ఈ పదేళ్ళూ దీనికి చెయ్యలేక నా ప్రాణాలు పోయాయనుకోండి. ఇప్పటికైనా కాస్త తెరిపి దొరికింది నాకు" అంది రిలీఫ్‌గా నిట్టూరుస్తూ.

ఎందుకో ఆమె మాటలు కాస్త ఆశ్చర్యాన్ని కల్గించాయి నాకు. అన్నీ వింటూ, చూస్తూ వీల్‌చేర్‌లో కూర్చున్న గీతికవేపు అప్రయత్నంగా చూసిన నాకు ఆ అమ్మాయి కళ్ళు సుచిత్ర మాటలకు బాధగా నవ్వినట్టు అన్పించాయి.

నేను తనవేపే తదేకంగా చూస్తున్నందుకేమో పలకరింపుగా చూసిందా అమ్మాయి. ఇంకాసేపు చూస్తే ఎక్కడ మాట్లాడాల్సి వస్తుందో అన్నట్టుగా చూపు మరల్చుకున్నాను నేను.

కానీ తన పలకరింపుకు నేను జవాబు చెప్పలేదనే గీతిక మనసులోని బాధ ఆమె కళ్ళల్లో అప్పుడు చూసి గుర్తించలేకపోయినా ఇప్పుడు జెస్సీని, రాబిన్‌నూ చూసిం తర్వాత స్పష్టంగా చూడగల్గుతున్నాను. అంతేకాదు. రాబిన్‌పై జెస్సీ కురిపించే అనురాగవర్షం గమనించిం తర్వాత కన్నకూతురనే మమకారం లేకుండా సుచిత్ర అలా అన్న మాటలకు గీతిక మనసు ఎన్ని ముక్కలైందో కూడా ఊహించుకోగల్గుతున్నాను.

అంత మందిలో ఒక్కరైనా ఆనాడు గీతికను పలకరించి వుంటే...వేరే ఎవరి గురించో ఎందుకు! ఆ జాలి కళ్ళ పలకరింపు చూపులకు నేను ఒక చిన్న చిరునవ్వు నవ్వగలిగి వుంటే, ఒక చిన్న మాట ఆదరపూర్వకంగా అనగలిగి వుంటే...ఆనాటి నా ప్రవర్తన నాకే అసహ్యకరంగా తోచింది.

గీతిక జ్ఞాపకాలతో మనసంతా బాధగా ఏదోలాగయిపోయింది.

తల్లిదండ్రి లేని అనాథ అనీ, అవిటివాడనీ జాలితో హృదయం ద్రవించి బాబుని తెచ్చుకుని అసహ్యించుకోకుండా వాడికన్నీ చేసి, కన్నతల్లిని మరిపిస్తూంది జెస్సీ. కానీ అందరూ వుండే గీతిక అనాథలాగా డిజేబుల్డ్ చిల్డ్రన్స్ హోమ్‌లో కాలం గడుపుతూంది.

జెస్సీ ఎంత ముందుచూపుతో మనుషుల వింత మనస్తత్వాలని ఎంతగానో అర్థంచేసుకుని అలా ఫ్రంట్ డోర్‌పై వ్రాసిపెట్టి వుండాలి? జెస్సీ అన్నట్టుగా ప్రతి ఒక్కరూ — "వికలాంగులూ మనుషులేననీ, వాళ్ళకీ మనందరికన్నా సున్నితమైన మనసుంటుందనీ ఆలోచించగల్గితే? వాళ్ళని అసహ్యించుకోకుండా, వాళ్ళ దీన స్థితిని హేళన చెయ్యకుండా ఆదరంగా ఒక చిన్నమాట అనగల్గితే..... ఈ ఆలోచనల్లో ఎన్నెన్ని సంఘటనలు గుర్తొస్తున్నాయో! ఇండియాలో ఎంతోమంది ఎన్నోసార్లు గుడ్డి, కుంటి, బిచ్చగాళ్ళను విదిలించుకుని, దులపరించుకుని దూరంగాపోయి, వున్నాడో, లేడో తెలివి దేవుడి హుండీలో నా తీరిన, తీరబోయే కోరికలకు లంచంగా ఎంత డబ్బు గుమ్మరించలేదు! తల్చుకుంటే నాలో ఎంత స్వార్థం, ఎంత సంకుచితత్వం నిండిపోయాయి అన్పించింది.

జెస్సీలోని మానవత్వం, కరుణ నేను నమ్మిన దేవుళ్ళలోని దైవత్వం కన్నా మిన్నగా, మహోన్నతంగా ప్రకాశిస్తూ కన్పించసాగింది. అసలు వికలాంగులలోని శారీరక లోపం కన్నా వాళ్ళను చూసి అసహ్యపడుతూ స్వార్థచింతనతో పసిమనసు గాయపరుస్తూ, కన్నబిడ్డను కూడా తమ నుంచి దూరంగా పంపివేయగల్గిన సుచిత్ర లాంటివాళ్ళు, మాట్లాడితే మహా పాపం అన్నట్టుగా వాళ్ళకు దూరంగా జరిగి, వాళ్ళ గురించిన ఆలోచనలు కూడా దరికి రానివ్వని నాలాంటివారి మనసుల్లోని లోపం మరీ భరించరానిది, జాలిపడరానిది, క్షమించలేనిది.

గీతిక జ్ఞాపకాలలో మొదటిసారిగా కళ్ళల్లో చిప్పిల్లిన నీటిని తుడుచుకుంటూ విజిటింగ్ అవర్స్ ఎప్పుడంటూ ఫిజికల్లీ డిజేబుల్డ్ చిల్డ్రన్స్ హోమ్‌కు ఫోన్ చేయకుండా వుండలేకపోయాను.

ఏదో, మాగజైన్‌లో చదివిన వాక్యం "వికలాంగులు దేవుడి సృష్టిలోంచి పొరపాటున రాలిపడిన అసంపూర్ణ శిల్పాలు" పదే పదే గుర్తురాసాగింది.